రైతులంటే చిన్నచూపా..

● మొన్నటి వరకు... తెల్లవారుజామున విద్యుత్ సరఫరా


● ఇప్పుడు.. మండే ఎండలకు పట్టపగలు సరఫరా

● భానుడి భగభగలలో పంటకు నీరు పెట్టడం ఎలా

● ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



రైతులకు తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. ఇచ్చే విద్యుత్‌ను రైతులు వాడుకునేలా ఇస్తున్నామా లేదా.. ఈ సమయంలో ఇవ్వడం ఉపయోగపడుతోందా లేదా అనే ధ్యాసే లేకుండా విద్యుత్ సరఫరా సాగిస్తున్నారు. మొన్నటి వరకు చలికాలం తెల్లవారుజామున 4గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా సాగిస్తున్నారు. ఇంత వేడిలో పంటలకు నీరు పెడితే పైరు బతుకుతుందా..? ఎండల్లో విద్యుత్ ఇస్తే ఎలా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పులివెందుల, ఏప్రిల్ 7: జిల్లాలో కరువు విలయతాండవం చేస్తోంది. జలాశయాలు అడుగంటాయి. దీంతో బోరుబావుల కింద మాత్రమే పంటలు సాగులో ఉన్నాయి. పులివెందుల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోను ఉద్యానపంటలలైన చీనీ, అరటి, బొప్పాయి, మామిడి పంటలతో పాటు కొర్ర, పత్తి తదితర పంటలు సాగులో ఉన్నాయి. ఇక ఒకటి రెండువారాల్లో బోరుబావుల కింద పత్తి, మిరప, మొక్కజొన్న తదితర పంటలను రైతులు సాగు చేయనున్నారు. ఇప్పుడు ఇస్తున్న విద్యుత్ సరఫరా వేళలతో పంటలు సాగు చేయడం ఎలా అని రైతులు తలలు పట్టుకుంటున్నారు. పంటలకు నీటి తడులు అందించడం రైతులకు నరకప్రాయంగా మారింది.

అనుకూలం కాని వేళలో విద్యుత్

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు తెచ్చినప్పటి నుంచి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరీముఖ్యంగా మార్చి 15 నుంచి భానుడి భగభగలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీంతో ఉదయం 10 గంటల నుంచే ఎండల వేడి పెరుగుతోంది. దీని కారణంగా పంటలకు నీటితడులు ఇవ్వాలంటే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రైతులకు విద్యుత్ సరఫరా తెల్లవారుజామున 4 లేదా 5 గంటల నుంచి చేస్తే మధ్యాహ్నం 1 లేదా 2గంటల వరకు సాగేది. ఈ సమయమైతే పంటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు అంటున్నారు. ఇదే పద్ధతి ఎప్పటి నుంచో ఉంది. రైతులు పొలం పనులు చేసుకునేది కూడా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకే. ప్రస్తుతం రైతులకు అనుకూలం లేని విధంగా విద్యుత్ సరఫరా సాగిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. విద్యుత్ తొమ్మిది గంటల పాటు ఇస్తున్నప్పటికి ఎండల వేడికి విద్యుత్‌ను వినియోగించుకోవడం ఇబ్బందిగా మారిందని రైతులు అంటున్నారు.

మండే ఎండల్లో నీటి తడులు

ఉద్యాన పంటలకు తుంపర, బిందుసేద్యం ద్వారా నీటి తడులు అందిస్తున్నారు. మిగిలిన పంటలకు మోటర్ ఆన్ చేసి కాల్వల ద్వారా నీటితడులు అందించాల్సిందే. కాల్వల ద్వారా నీటి తడులు అందించాలంటే రైతు పొలం వద్దే ఉండి పారతో నీటిని మళ్లించాల్సి ఉంటుంది. ఎండలో ఇలా చేయడం రైతులకు చాలా కష్టంగా మారింది. ఎండ వేళలో నీటి పారకం రైతులకే కాదు.. పంటలకూ ఆరోగ్యకరం కాదు. బిందు, తుంపర సేద్యం ద్వారా మిట్టమధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో వేడినీరు ప్రవహించి మొక్కలు కూడా ఎదగడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. డ్రిప్ ద్వారా నీటి తడులు అందించే రైతులు విద్యుత్ సరఫరా వేళలు మార్చాలని కోరుతున్నారు. చలికాలంలో చలికి నీటి తడులు అందించేందుకు ఇబ్బందులు పడుతూ వెళ్లామని, ఇపుడేమో ఎండలకు నీటితడులు అందించేందుకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. కాలం ఏదైనా.. నీటితడులు అందించేందుకు రైతులు ఇబ్బంది పడాల్సిందేనా అని పలువురు ప్రశ్నిసున్నారు. చలి కాలం అయిన, ఎండా కాలం అయినా పొలం పనులు చూసుకునేది ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మాత్రమే కాబట్టి ఆ సమయంలోనే విద్యుత్ సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.



తొండూరు వద్ద ఎర్రని ఎండలో పొలానికి నీళ్లు పెడుతున్న రైతు

సాక్ష్యాలు తుడిపేస్తుంటే చూస్తుండడానికి

అవినాష్ చిన్నపిల్లాడా?

● శివప్రకాష్‌రెడ్డికైనా సాక్ష్యాలు చెరిపేస్తున్న విషయం చెప్పారా..

● ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి మాటలపై బీటెక్ రవి కౌంటర్



మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల, ఏప్రిల్ 7: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగిన ప్రదేశంలో రక్తపు మరకలు ఎర్రగంగిరెడ్డి తుడిపేస్తుంటే చూస్తుండడానికి ఎంపీ అవినాష్‌రెడ్డి చిన్న పిల్లవాడా అని మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథ రెడ్డి (బీటెక్ రవి) ప్రశ్నించారు. వీరపునాయుని పల్లె మండలం మొయిళ్లచెరువు గ్రామంలో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి మాట్లాడిన దానిపై బీటెక్ రవి ఆయనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందరెడ్డి హత్య జరిగిన ప్రాంతానికి ఎంపీ అవినాష్‌రెడ్డి వెళ్లినపుడు అక్కడ రక్తపు మరకలు తుడుస్తుంటే దానిని అడ్డుకోలేదన్నారు. ఆయన చూస్తూ నిల్చోవడానికి చిన్నపిల్లవాడా అని ప్రశ్నించారు. నర్రెడ్డి శివప్రకాష్‌రెడ్డి ఫోన్ చేసి చెబితే వివేకా ఇంటికి వెళ్లానని ఎంపీ చెబుతున్నారన్నారు. రక్తపు మరకలు చెరిపేస్తున్నారన్న విషయాన్ని నువ్వు అడ్డుకోకపోయినా నీకు ఫోన్ చేసిన శివప్రకాష్‌రెడ్డికి ఫోన్ చేసి ఎందుకు చెప్పలేదని సూటిగా ప్రశ్నించారు. కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ అక్కడ రక్తపుమరకలు తుడుస్తూ ఉంటే, సాక్ష్యాలన్నీ తారుమారు చేస్తుంటే పాపం మా అవినాష్ అమాయకంగా ఏమీ అనకుండా పక్కనే కూర్చున్నాడుని.. అదే అతను చేసిన నేరమా అని అన్నారన్నారు. అవినాష్‌రెడ్డిని సూటిగా ప్రశ్నిస్తున్నాం, ఏదైన శివప్రకాష్ రెడ్డి ఫోన్ చేసి చెబితే మేము అక్కడకు వెళ్లామని చెప్పుకొనే మీరు అక్కడకు వెళ్లిన తర్వాత ఎర్రగంగిరెడ్డి ఆ రకంగా రక్తపు మరకలు తుడుస్తూ అక్కడుండే సాక్ష్యాలను తారుమారు చేస్తుంటే.. ఒక పార్లమెంట్ సభ్యుడిగా, ఒక కామన్ మ్యాన్‌గా అయినా కూడా పోలీసులకు గానీ లేదా శివప్రకాష్‌రెడ్డికి రక్తపుమరకలు ఈ విధంగా తుడుస్తున్నారు.. సాక్ష్యాలను తారుమారుచేసే ప్రయత్నం జరుగుతోందని చెప్పాల్సిన మినిమమ్ బాధ్యత అవినాష్‌రెడ్డికి లేదా అని సూటిగా ప్రశ్నిస్తున్నామన్నారు. కమలాపురం ఎమ్మెల్యేగారు ఎర్రగంగిరెడ్డే హత్య చేసిందని పదేపదే బల్లగుద్ది చెప్పడం జరిగిందన్నారు. అదే ఎర్రగంగిరెడ్డి హత్య చేసి ఉంటే అదేరోజు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అనేకమైన వాట్సప్ కాల్స్ ఎర్రగంగిరెడ్డి ఫోన్ నుంచి అవినాష్‌రెడ్డి ఫోన్‌కు గానీ, అవినాష్ రెడ్డి ఫోన్ నుంచి ఎర్రగంగిరెడ్డి ఫోన్‌కు గానీ వెళ్లినట్లు గూగుల్ టేకవుట్ ద్వారా సీబీఐ డాక్యుమెంటరీ ఆధారాలను తీసిందన్నారు. కమలాపురం ఎమ్మెల్యే చెప్పినదానిని బట్టి అవినాష్‌రెడ్డి డైరెక్షన్‌లో ఈ రకంగా చేయండి అంటే ఎర్రగంగిరెడ్డి హత్య చేసినట్లు ఆయన చెప్పకనే నిజాన్ని బట్టబయలు చేశారన్నారు.



మేనిఫెస్టోలో హామీలు అన్నీ నెరవేరాయా?

● జై జగన్ అనే వారు సమాధానం చెప్పాలి ● వైఎస్సార్‌కు పుట్టలేదని సజ్జల అవమానించారు ● అధికార మదంతో కొట్టుకుంటున్న సజ్జల

● ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదు ● వైఎస్ షర్మిల ఫైర్

కడప, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన మేనిఫెస్టోలో హామీలు అన్నీ నెరవేరాయా అని పలువురుని ఉద్దేశించి ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సూటిగా ప్రశ్నించారు. ఆదివారం రాత్రి చెన్నూరు వద్ద బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ మా సభల్లో జై జగన్ అని అరిచే వారిని ఒకటి అడుగుతున్న, నేను కూడా ఒకప్పుడు జై జగన్ అనుకుంటూ తిరిగిన దాన్నే అన్నారు. జగన్ జైల్లో ఉన్నప్పుడు ప్రజల కోసం రోడ్ల మీద తిరిగినదాన్నే అన్నారు. జగన్ పెట్టిన మేనిఫెస్టోను ఊరూరా తిరిగి ప్రచార చేశా అన్నారు. జగన్ అధికారంలోకి వస్తే అమ్మఒడి ఇద్దరు పిల్లలకు ఇస్తామని నేనే చెప్పా, ఇపుడు ఇద్దరు పిల్లలకు వస్తుందా అని ప్రశ్నించారు. రైతులు రాజులు అవుతారు అని ప్రచారం చేశారు. లాభాలు వచ్చాయా, ఇచ్చాడా ధరల స్థిరీకరణ నిధి అన్నారు. పంట నష్టపోతే పరిహారం వస్తుందని జగన్ అన్న తరఫున చెప్పిన వ్యక్తిని నేను, పూర్తి మద్యపాన నిషేధం చేస్తా అని చెప్పా, అయిందా మద్యపాన నిషేధం, నిషేధం పక్కనపెడితే సర్కార్ అమ్మే పరిస్థితి ఉందన్నారు. ఇచ్చిన ఒక్క హామీ అయినా అమలైందా, మీలాగే నేను కూడా నమ్మి మోసపోయా, జగన్‌కు ఓటేస్తే ప్రత్యేక హోదా వస్తుందని చెప్పా, ప్రత్యేక హోదా తెచ్చాడా అన్నారు. అధికారం ఇస్తే రాష్ట్రాన్ని బీజేపీకి జగన్ తాకట్టుపెట్టాడన్నారు. పక్క రాష్ట్రాలకు రాజధానాలు ఉన్నాయి, ఇలాంటి వాళ్లకు ఎందుకు ఓటు వేయాలో జై జగన్ అనే వాళ్లు సమాధానం చెప్పాలన్నారు. ఇదే జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మిన వ్యక్తిని నేను అన్నారు. మళ్లీ జగన్‌ను నమ్మి మోసపోతారా అని ప్రశ్నించారు. నేను కాంగ్రెస్ పగ్గాలు చేపట్టింది కేవలం రాష్ట్ర అభివృద్ధి కోసమే, ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీ పదేళ్ల ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టింది, హోదా వస్తేనే రాష్ట్రంలో పరిశ్రమలు వస్తాయన్నారు. జగన్ కనీసం కడప స్టీల్ ఏర్పాటు కోసం కూడా కృషి చేయలేదన్నారు.

కడప సీటు జగన్ వైఎస్ వివేకాను చంపిన నిందితులకు ఇచ్చాడు, వైఎస్ వివేకా ప్రజల మనిషి, ప్రజల కోసమే బ్రతికిన మనిషి, అలాంటి మంచి మనిషిని నరికి చంపారన్నారు. చంపిన వాళ్లకు, చంపించిన వాళ్లకు మధ్య ఎన్నో లావాదేవీలు జరిగాయన్నారు. సీబీఐ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయి.. అవినాష్‌రెడ్డి నిందితుడు అని సీబీఐ చెప్పింది, నిందితుడిని జగన్ కాపాడుతున్నాడు, న్యాయం చేయకపోగా మళ్లీ అదేమనిషికి టికెట్ ఇచ్చారన్నారు. ఇది అహంకార కాకపోతే మరేంటన్నారు. ఈ అన్యాయం అడ్డుకోవడానికి మాత్రమే నేను నిలబడ్డా అన్నారు.





కమలాపురం బస్సు యాత్రకు హాజరైన జనాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

సజ్జలపై వైఎస్ షర్మిల ఫైర్

సజ్జల నన్ను పెయిడ్ ఆర్టిస్ట్ అని అంటున్నారు, వైఎస్సార్ బిడ్డను పెయిడ్ ఆర్టిస్ట్ అంటావా, అధికార మదం తలకు ఎక్కిందా అని ప్రశ్నించారు. మతి ఉండే మాట్లాడుతున్నావా అని ధ్వజమెత్తారు. నువ్వు, నీ కొడుకు పేమెంట్ తీసుకొని నన్ను, సునీతను నానా రకాలుగా హింసించారు. సోషల్ మీడియాలో మాపై దుష్ప్రచారం చేశారు. నేను వైఎస్‌కే పుట్టలేదని విజయమ్మను అవమానపరిచారు. నోరు ఉంది కదా అని ఏదిపడితే అది మాట్లాడితే ఊరుకునేది లేదు, మీ ఇంట్లో ఆడవాళ్లు లేరా మీ ఇంట్లో ఆడవాళ్లు కూడా పెయిడ్ ఆర్టిస్టులా, మేము అంత పెద్ద మాటలు మాట్లాడలేదు, మాకు సంస్కారం ఉందని షర్మిల అన్నారు.

పేదలకేది పప్పన్నం



సుండుపల్లె, ఏప్రిల్ 7: పేదల సంక్షేమానికి వైసీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని గొప్పలు చెప్పుకునే జగన్‌మోహన్ రెడ్డి సర్కారు పేదలకు అందించే నిత్యావసరాల్లో కోతలు విధిస్తూ వారిపై ఆర్థిక భారం మోపుతోంది. ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తుండగా కందిపప్పు మాత్రం సుమారు 8 నెలల నుంచి పంపిణీ చేయడం లేదు. ఉగాది పండుగ సందర్భంగా ఈనెలలో అయినా ఇస్తారని ఆశపడ్డ పేదల ఆశలు అడియాశలయ్యాయి. ఎనిమిది నెలలుగా ఇవ్వకపోయినా కనీసం ఏప్రిల్‌లో నిర్వహించుకునే ఉగాది పండుగకైనా రేషన్ వాహనాల ద్వారా కందిపప్పు ఇస్తారనుకున్న కార్డుదారులు ఆశలపై వైసీపీ ప్రభుత్వం నీళ్లు చల్లింది. పండుగ రోజైనా పప్పన్నం తినే భాగ్యం పేదలకు కల్పించలేదు. బహిరంగ మార్కెట్‌లో కిలో ధర రూ.160 నుంచి రూ.180 వరకు ఉంది. దాంతో పేదలు కొనలేకున్నారు. రైతు బజార్లలో కిలో రూ.160 వరకు అమ్ముతున్నా అది రెండో రకానికి చెందినది. ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత రావడంతో అన్నీ సరఫరా చేస్తున్నట్లు ప్రభుత్వం డప్పు కొడుతోందన్న విమర్శలు ఉన్నాయి.

సొమ్ము సర్దుబాటు చేయలేకనే..

మండలంలోని రేషన్ కార్డుదారులకు కిలో రూ.67 చొప్పున కందిపప్పును రాయితీపై ఇవ్వాల్సి ఉంది. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.170 వరకు పలుకుతోంది. ఆ మేరకు పంపిణీ చేయాలంటే ప్రభుత్వం ప్రతినెలా లక్షల్లో రాయితీ మొత్తాన్ని కార్పొరేషన్‌కు అందించాల్సి ఉంది. ఈ సొమ్ము సర్దుబాటు చేయలేకనే చేతులెత్తేసినట్లు విశ్వసనీయ సమాచారం. పేదలు తిన్నా.. తినకపోయినా మా పని మేము చేసుకుంటూ పోతామన్నట్లు ప్రభుత్వ తీరు ఉందని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ఈనెల తప్పక అందించాలని కార్డుదారులు కోరుతున్నారు.

నిరుపేదల కడుపు కొట్టకండి..

ఉగాది పండుగకు పేద ప్రజలు తినే కందిపప్పు సరఫరా నిలిపివేయడం హాస్యాస్పదంగా ఉంది. జగన్ పేదల కడుపు కొడుతున్నారు. సబ్సిడీ ధరకు పేదలకు కందిపప్పు అందించలేని దయనీయ పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. ఈ ఉగాది ఈ ప్రభుత్వానికి చివరిది. టీడీపీ అధికారంలోకి రాగానే రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ చౌకదుకాణాల్లో నిత్యావసర సరుకులు అందుబాటులోకి తెస్తాము.

- సుగవాసి ప్రసాద్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి

కందిపప్పు బంగారమైంది..

ఈ ప్రభుత్వంలో కందిపప్పు బంగారంగా మారింది. రోజువారీ కూలి పనులకు వెళ్లి ఆ డబ్బుతో నిత్యావసర సరుకులు కొని తింటున్నాము. రేషన్ దుకాణాల్లో బియ్యం, చక్కెర తప్ప ఇంకేమీ ఇవ్వడం లేదు. గత ప్రభుత్వంలో అన్ని రకాల నిత్యావసర సరుకులు తక్కువ ధరకే రేషన్ దుకాణాల్లో లభించేది.

- అమ్మణ్ణమ్మ, జి.రెడ్డివారిపల్లె

రెండు నెలలుగా సరఫరా లేదు..

రెండు నెలలుగా ప్రభుత్వం నుంచి కందిపప్పు సరఫరా లేదు. అంతకు ముందు ప్రభుత్వం నుంచి అందించారు. డీడీలు కట్టిన ప్రతి ఒక్క షాపుకు సరఫరా అందేది. ప్రభుత్వం నుంచి సరఫరా అందగానే డీడీలు కట్టించి పంపిణీ జరిగేలా చూస్తాము.

- హరి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, రాజంపేట

హూ కిల్డ్ బాబాయ్..

● కడప గడపలో సర్వత్రా చర్చ ● 2019లో వివేకా హత్యను క్యాచ్ చేసుకున్న వైసీపీ ● అప్పట్లో టీడీపీపై నెపం

● వివేకాను చంపింది అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి అంటూ సీబీఐ చార్ట్‌లో చూపిస్తూ షర్మిల, సునీత ఆరోపణలు ● ఎన్నికల వేళ మళ్లీ హాట్‌టాపిక్‌గా వివేకా హత్య కేసు

2019 ఎన్నికల్లో వివేకా హత్య అప్పట్లో సంచలనం. చంద్రబాబే హత్య చేయించారంటూ అప్పట్లో జగన్ అండ్ కో విస్తృత ప్రచారం చేసింది. అప్పట్లో జగన్ అండ్ కో క్రియేటివిటికి జగనే కాదు వివేకా కుటుంబీకులే నమ్మేశారు. అప్పట్లో చంద్రబాబు, ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి చంపించారంటూ అప్పట్లో వైసీపీ దుష్ప్రచారానికి తెర తీసింది. కాలం ఎవరినీ వదలదంటారు. చేసినోడికి చేసినంత అనే సామెత ఉంది. సీన్ కట్ చేస్తే... వివేకా హత్య కేసులో సీబీఐ ఎంపీ అవినాష్‌రెడ్డి, వాళ్ల నాన్న భాస్కర్‌రెడ్డి ఇతరుల పేర్లు నమోదు చేస్తూ చార్జిషీట్ దాఖలు చేసింది. దీన్నే ప్రధానంగా ప్రస్తావిస్తూ పీసీసీ అధ్యక్షురాలి హోదాలో వైఎస్ షర్మిల 'హూ కిల్డ్ వైఎస్ వివేకా బాబాయి''... అంటూ ప్రశ్నిస్తోంది. ఆమె గత మూడురోజులుగా కడప జిల్లాలో చేపట్టిన బస్సు యాత్రలో ప్రధానంగా వివేకానందరెడ్డి హత్యనే ప్రస్తావిస్తుండటంతో.. ఐదేళ్ల తరువాత మళ్లీ ఇప్పుడు ఈ అంశం హాట్‌టాపిక్‌గా మారింది.





(కడప-ఆంధ్రజ్యోతి): దివంగత వైఎస్ వివేకా చాలా సౌమ్యుడు. ఆయన ఎంపీగా ఉన్నా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ తమ్ముడిగా... మంత్రిగా పనిచేసినా ఎక్కడే కానీ గర్వం ఉండేది కాదు. ఆయనకు తగ్గట్లుగా పనిచేసుకుంటూ వెళ్లిపోయేవారు. వైఎస్ వివేకాకు ఉమ్మడి కడప జిల్లా వాసులతో మంచి సంబంధాలు ఉన్నాయి. ప్రతి చోటా ఆయనకంటూ ఓ ఫాలోయింగ్ ఉండేది. ఆయన ఎక్కడికి వెళ్లినా కూడా హడావుడి లేకుండా తన స్టైల్‌లో వెళ్లేవారు. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల సమయంలో వైఎస్ వివేకా హత్య ఉమ్మడి రాష్ట్రంలో సంచలనం. ఆ రోజుకు రాష్ట్రం విడిపోయినప్పటికీ ఉమ్మడి రాష్ట్రంలో ఆయనకు ఉన్న బంధాలతో వివేకా హత్యను జనం బాగా కనెక్ట్ అయ్యారు. ఎలాగైనా సరే హంతకులకు శిక్ష పడాలంటే ఓటరు అనే ఆయుధాన్ని ప్రయోగించారంటున్నారు.

వివేకానందరెడ్డి హత్యను 2019లో వైసీపీ ఉపయోగించుకుంది. చంద్రబాబు, బీటెక్ రవి, ఆదినారాయణరెడ్డిలు చంపించారంటూ ప్రచారానికి తెరలేపింది. అయితే సీబీఐ విచారణ తరువాత సినిమా మారింది. వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి నుంచి పలు సంచలనాలు బయటికి వచ్చాయి. ఎంపీ అవినాష్‌రెడ్డి ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిలపై సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. ఇక మూడు రోజులుగా కడప జిల్లాలో చేపట్టిన బస్సు యాత్రలో ప్రధానంగా వివేకా హత్య గురించి షర్మిలా, సునీతారెడ్డిలు విరుచుకుపడుతున్నారు. సీబీఐ ఆరోపణలు మోపిన సిట్టింగ్ ఎంపీ అవినాష్‌రెడ్డికే మళ్లీ టికెట్ ఇస్తున్నారంటూ షర్మిల మండిపడుతున్నారు. వివేకా హత్యలో ఎంపీ అవినాష్ పాత్ర ఉందంటూ సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. ఇలా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ అవినాష్‌రెడ్డికి మళ్లీ టికెట్ ఇవ్వడాన్ని షర్మిల, సునీత జీర్ణించుకోలేకపోతున్నారు. వివేకా చివరి కోరిక షర్మిలను ఎంపీగా చూడాలన్నదే. అయితే షర్మిల, సునీతలు ఇద్దరు తోబుట్టువులు. తమకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించేందుకు జనం వద్దకు వెళుతున్నారు. ఇప్పటికే బద్వేలు, కడప, కమలాపురం నియోజకవర్గాల్లో షర్మిల పర్యటించింది.

ప్రతి చోటా వివేకా హత్యలో ఎంపీ అవినాష్‌రెడ్డి పాత్రపై విరుచుకుపడుతూ వచ్చారు. వివేకాను టీడీపీనేతలే చంపారంటూ అప్పట్లో వైసీపీ దుష్ప్రచారం చేసింది. అయితే ఇప్పుడు సీబీఐ విచారణతో హంతకులు ఎవరో తెలిసిపోయింది. బాబాయిని ఎవరు చంపారంటూ ఓ పక్క షర్మిల, సునీతలు ప్రశ్నిస్తుంటే జగన్‌శిబిరం షర్మిల మాటలకు స్పందించవద్దంటున్నారు. అయినప్పటికీ ఎంపీ అవినాష్‌రెడ్డి ఇతరత్రా నేతలతో షర్మిల వ్యాఖ్యలను ఖండించారు.

గొర్రెపిల్లలపై కుక్కల దాడి

● రూ.3 లక్షలు నష్టం ● బాధితుల ఆవేదన



గొర్రెపిల్లల కళేబరాలు

జమ్మలమడుగు, ఏప్రిల్ 7: దానవులపాడు వద్ద నుంచి పెన్నానదిలో సున్నపురాళ్లపల్లెకు వెళ్లే దారిలో ఆదివారం మధ్యాహ్నం గొర్రె పిల్లలపై కుక్కలు దాడిచేశాయి. గొర్రెపిల్లల యజమానులు దేవగుడి వాసి లావనూరు సుబ్బరాయుడు, సున్నపురాళ్లపల్లెకు చెందిన మేకల సుబ్బరాయుడు, మామా అల్లుడు. భోజనానికి ఇంటికి వెళ్లిన సమయంలో సంఘటన జరిగింది. మధ్యాహ్నం స్థానికంగా ఉన్న తోటల్లో ఉండే కుక్కలు గొర్రెపిల్లల వద్దకు వచ్చి జొరబడి దాడి చేశాయి. మొత్తం అక్కడ 70 గొర్రెపిల్లలు ఉండగా సుమారు 40 గొర్రెపిల్లలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి చంపాయి. ఈ దాడిలో గొర్రెపిల్లలు మొత్తం దాదాపు రూ.3 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు విలేకరులకు తెలిపారు.

పెన్షనర్స్ నాయకుడు దస్తగిరి మృతి



దస్తగిరి (ఫైల్‌ఫొటో)

జమ్మలమడుగు, ఏప్రిల్ 7: తాలూకా పెన్షనర్స్ గౌరవాధ్యక్షుడు పొన్నారి దస్తగిరి (79) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడు దస్తగిరి 1.7.1945లో జన్మించినట్లు జమ్మలమడుగు తాలూకా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు దేవదానం తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో కర్నూలు ఆస్పత్రికి తరలించారని చికిత్స పొందుతూ ఆయన మృతిచెందినట్లు తెలిపారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో పెన్షనర్ల కోసం భవనాన్ని నిర్మించడానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా మృతుడు దస్తగిరికి పెన్షనర్లు శ్రద్ధాంజలి ఘటించారు. ఈయన పొన్నారి శతకం, చాణక్యనీతి దర్పణం రాసి సహజ కవిగా స్థానికంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం కార్యదర్శి రామచంద్రారెడ్డి, సహాయ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారెడ్డి, రామచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముని సేవలో ఆర్టీఐ కమిషనర్



కోదండరామున్ని దర్శించుకున్న కమిషనర్

ఒంటిమిట్ట, ఏప్రిల్7: ఏకశిలా నగిరి కోదండరాముల వారిని స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. వీరికి టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంగ మండపంలో మూలవిరాట్టు శ్రీసీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాతన ఆలయాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. టీటీడీ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

దేవుని కడప ఆలయంలో...

కడప(కలెక్టరేట్) ఏప్రిల్ 7: ఆంధ్రప్రదేశ్ సమాచారహక్కు చట్టం అమలు కమిషనరు చెన్నారెడ్డి ఆదివారం దేవుని కడపలోని ప్రముఖ పుణ్య క్షేత్రం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మనోజ్ కుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గ్రామ రెవెన్యూ అధికారి దేవానందకుమార్ తదితరులు ఉన్నారు

వైసీపీ ప్రచారంలో పాల్గొన్న కాంట్రాక్టు ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి



వైసీపీ ఎన్నికల ప్రచారాల్లో పాల్గొన్న ఉద్యోగులు

వేంపల్లె, ఏప్రిల్ 7: ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే వైసీపీకి ప్రచారం, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్న కాంట్రాక్టు ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఎన్నికల అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు కాంట్రాక్టు ఉద్యోగులపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పాల్గొన్న ఉద్యోగుల ఫొటోలను విలేకరులకు ఆయన విడుదల చేశారు. గండి దేవస్థానం, ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ, వేంపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే ఉద్యోగులు ప్రసాద్, జావెద్, విజయ్, తేజేశ్వర్, గంగరాజు, అంజనేయులు, శివ కాంట్రా క్టు ఉద్యోగులుగా పనిచేస్తున్నారని, వీరంతా ప్రభుత్వం చేత జీతం తీసుకుంటూ వైసీపీ కి మద్దతుగా పనిచేయడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని వీరిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ఒక వైపు ఐపీఎల్ మరో వైపు ఎన్నికల ఫీవర్



పోరుమామిళ్ల, ఏప్రిల్ 7: యువకులకు పరీక్షల ఫీవర్ ముగిసింది. వెనువెంటనే క్రికెట్ ప్రియులకు ఐపీఎల్, మరింత ముందుకెళితే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో ఎన్నికల ఫీవర్ మొదలైంది. గ్రామాల్లో సైతం యువకులు ఇంటి పట్టున కూర్చుండి టీవీలకు అతుక్కు పోతున్నారు. ఇదిలా ఉండగా పూర్తిగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక పోయినా, అభ్యర్థులు ఖరారు కాకముందే ఫలానా అభ్యర్థి గెలుపు అంటూ బెట్టింగ్ పెట్టేందుకు సిద్ధం అవుతోంది. నియోజకవర్గంలో ఓ అభ్యర్థి పార్టీ గుర్తు మారడం తో అవతల పార్టీ నేతలు జోరుగా ఉన్నారు. మొదటి నుంచీ అయోమయంలో ఉండి ప్రచార సమయంలో ఎడముఖం పెడముఖంగా ఉన్న నేతలు కలిసినట్టే కలిసి ఎవరికి వారే ప్రచారం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యర్థి వర్గం బలహీన పడిందని తమ అభ్యర్థి గెలుపు ఎవరూ ఆపలేరని మెజార్టీ పెద్దగా వస్తుంది అని ప్రచారం చేసుకుంటూ ఎవరైనా బెట్టింగ్ కడితే తాము సిద్ధంగా ఉన్నామని మధ్యవర్తుల ద్వారా సమాచారం చేరవేస్తున్నారు. నామినేషన్ల పర్వం ప్రారంభమే కాలేదు. అప్పుడే గెలుపు, మెజార్టీలపై పందేలు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇటీవల పార్టీ అభ్యర్థుల గెలుపుపై తర్జన భర్జనలు పడుతూ గెలుపు మీద కొందరు మెజార్టీ మీద మరికొందరు బెట్టింగ్ పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉంటే ఐపీఎల్ ఫీవర్ గ్రామాలకు తాకింది. సాయంత్రం అవగానే యువకుల చేతుల్లోకి సెల్‌ఫోన్లు చేరిపోతున్నాయి. తాము నిర్ణయించుకున్న ప్రాంతాల్లో మాట్లాడుకుంటూ ఏటీం గెలుస్తుంది, క్రికెట్ ఎంత స్కోరు చేస్తారని బెట్టింగ్‌లకు సిద్ధమవుతున్నారు. వెయ్యి మొదలు స్థాయిని బట్టి ఎంత వరకైనా బెట్టింగ్‌లు పెట్టడానికి వెనకాడడంలేదు. వేసవి సెలవుల్లో ఎలాగూ పిల్లలు ఇంటి పట్టునే ఉన్నారు కదా అని భావిస్తున్నారే తప్ప వారి చేతల్లోని సెల్‌ఫోన్లతో ఏం చేస్తున్నారని వాటి మీద దృష్టిసారించడంలేదు. గేమ్స్ వైపు కూడా యువత ఆసక్తి కనబరచడం, సెల్‌లే తమ జీవితం, ప్రాణం, ఆటవిడుపు అంటూ సెల్‌ఫోనుల్లోనే నిమగ్నమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా కొందరు ఈ క్రికెట్ బెట్టింగ్‌లకు వెనుకాడడం లేదు. గతంలో పోలీసు అధికారులు వీటిపై అవగాహన నిర్వహించినా కొందరిని పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించినా కొందరి ధోరణిలో మార్పు రావడం లేదు. పోరుమామిళ్లలోని కొన్ని ప్రాంతాల్లో యువకులు తమ సెల్‌ఫోన్ల ద్వారా మెసేజ్‌లు అందించుకుంటూ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు మెండుగా ఉన్నాయి.

ఇప్పటికైనా పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించి వారి అలవాట్లపై దృష్టి పెట్టి బెట్టింగ్‌లకు దూరంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పోలీసు అధికారులు కూడా బెట్టింగ్ రాయుళ్లపై ప్రత్యేక నిఘా ఉంచి మొదటి దశలోనే వీటికి కళ్లెం వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంపై ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డిని వివరణ కోరగా, గతంలో పదిమంది బెట్టింగ్ రాయుళ్లను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ కూడా చేయించామన్నారు. ఆ బెట్టింగ్‌లకు పాల్పడేవారు ఎవరైనా ఉంటే చర్యలు తప్పవని ఎక్కడైనా జరుగు తున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తెస్తే వారిపై చర్యలు తీసుకుంటామని సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఆటో కార్మికులందరికీ ఇంటి స్థలాలు

టీడీపీలో చేరిన 150 మంది ఆటో కార్మికులు ● టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి భరోసా



ఆటో కార్మికులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

కడప (మారుతీనగర్) ఏప్రిల్ 7: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాగానే కడప నగరంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న కార్మికులందరికీ ఇంటి స్థలాలను వచ్చేలా చేస్తానని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ చిట్టిబోయిన సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నగరానికి చెందిన సుమారు 150 మందికి పైగా ఆటో కార్మికులు ఆర్. శ్రీనివాసరెడ్డి, టీడీపీ, కడప అసెంబ్లీ అభ్యర్థి ఆర్. మాధవిరెడ్డి సమక్షంలో ఆదివారం స్థానిక ద్వారకానగర్‌లోని ఆయన స్వగృహం వద్ద టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవచ్చేది టీడీపీ ప్రభుత్వమని, సమాజానికి సేవలందిస్తున్న ఆటో కార్మికులంతా తమ న్యాయమైన హక్కుల సాధనకోసం సంఘటితంగా వుండేలా ఒక యూనియన్ ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రభుత్వం నుంచి ఆటో కార్మికులకు అందాల్సిన సంక్షేమ ఫలాలను అర్హులైన కార్మికులందరికీ వర్తించేలా చేస్తామన్నారు. ఇప్పటికీ కొందరు సొంత ఆటోలేక బాడుగకు ఆటో వేస్తూ జీవనం సాగిస్తున్న వారికి కూడా ఫలాలు అందేలా చూస్తామన్నారు. ముఖ్యంగా నగరంలో వివిధ కూడళ్ళవద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వుండేలా ప్రత్యేకంగా ఆటో స్టాండ్స్ కల్పించేలా చేస్తామన్నారు. కార్మికులందరికీ గుర్తింపు కార్డులు, లైసెన్సులను అందించే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానంగా ప్రతి ఆటో కార్మికులందరికీ సొంత డబ్బు పెట్టి మరీ 5 లక్షల బీమా(ఇన్సూరెన్స్) సౌకర్యం కల్పించేందుకు చొరవ తీసుకుంటామన్నారు. కావున ఆటో కార్మికులంతా టీడీపీకి ఓట్లు వేసి కడప అసెంబ్లీ అభ్యర్థిగా బరిలో వున్న ఆర్. మాధవిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో నేతలు దస్తగిరి, మస్తాన్, సునీల్‌బాబు, నగేష్, రమేష్, తోపాటుగా టీడీపీ నేత శివారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఎన్నికలే పునాది

పౌరుల చైతన్యమే ప్రజాస్వామ్యానికి రక్ష ● ఓటు హక్కును అమ్ముకోకూడదు ● అభ్యుదయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతురెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అభ్యుదయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతురెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 7: ప్రజాస్వామ్యానికి ఎన్నికలే పునాదులు అని అభ్యుదయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిరెడ్డి హనుమంతురెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన అఖిలభారత అభ్యుదయ వే దిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అత్యుత్తమమైన పాలన విధానమని, దానిని కాపాడుకోవలసిన అవసరం ప్రజలందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై ఓటు హక్కు అమ్ముకోకుండా సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని సామాన్యులకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకుండాపోయిందన్నారు. ప్రజలు ఓటు హక్కు విలువను తెలుసుకుని దానిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వాల పాలన ప్రజల అభివృద్ధికి తోడ్పడేదిగా ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. రాష్ట కమిటీ సభ్యుడు సురేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరయ్య మాట్లాడుతూ రాజకీయ పార్టీల మేనిఫెస్టో మాత్రమే కాదు అభ్యర్థులు కూడా తమ నియోజకవర్గం అభివృద్ధికి సంబంధించిన మేనిఫెస్టో ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అభ్యుదయ వేదిక ప్రతినిధులు సీవీ సుధాకర్, హైదర్‌వల్లి, కె.గౌరీశంకర్, ఎం.శ్రీనివాసులు, ఎన్నికల నిఘావేదిక నాయకులు ఎస్.అరుణ్, దేవరక్రిష్ణ, జి.వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల కేసులో కుటుంబ సభ్యుల అరెస్ట్

కాశినాయన ఏప్రిల్ 7: వరకట్నం వేధింపుల కేసులో భర్త జాజం సిద్దులు, మామ జాజం ఎల్లోజి, అత్త జాజం క్రిష్ణవేణి మరదులు శివ,బాలును శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. కాశినాయన మండలం కొండ్రాజుపల్లెలో ఇటీవల ఉరివేసుకుని చనిపోయిన కుమారి సునీత(23) కేసులో అనుమానితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. తెలంగాణలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సిద్దులుతో రెండేళ్ల కిందట సునీతకు వివాహమైంది. వివాహమైన 3 నెలల నుంచే అదనపు కట్నంకోసం వేధింపులు మొదలయ్యాయని వారి వేధింపులు భరించలేక ఆమె బలవన్మరణానికి పాల్పడినట్లు మృతురాలి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు వారిని రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసరి సమీప అన్నోజిగూడలో అరెస్ట్ చేసి రాత్రి మైదుకూరు డీఎస్పీ టి.వెంకటేసులు ఎదుట హాజరు పరిచి అరెస్ట్ చూపి అనంతరం ఆదివారం బద్వేల్ కోర్టులో హాజరు పరిచామన్నారు.

మూడు ట్రాక్టర్లు పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

ఖాజీపేట, ఏప్రిల్ 7: అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మైదుకూరు రూరల్ సీఐ రామాంజులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆమేరకు ఒక ఇసుక ట్రాక్టరు, రెండు మట్టి ట్రాక్టర్లను పట్టుకుని ఇసుక ట్రాక్టర్‌ను మైన్స్ అధికారులకు, మట్టి ట్రాక్టర్లకు తహసీల్దారుకు అప్పగిస్తున్నామన్నారు. అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు

వడదెబ్బతో వృద్ధురాలు మృతి



బద్వేలు టౌన్, ఏప్రిల్ 7: మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో పీరమ్మ (70) ఆదివారం వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎండ తీవ్రత తట్టుకోలేక అస్వస్థతకు గురై మధ్యాహ్నం మృతి చెందినట్లు వారు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

ముద్దనూరు ఏప్రిల్7: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గుర్తుతెలియని (70) వృద్ధుడు శనివారం మృతి చెందినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. మార్చి 31న పులివెందుల రహదారి నల్లబల్లె సమీప పుల్లేరు వంక వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

కవులు సమాజ శ్రేయస్సును కాంక్షిస్తారు

వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఈశ్వర్‌రెడ్డి



కవులను సత్కరిస్తున్న రాయలసీమ టూరిజం సంస్థ ప్రతినిధులు


కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 7: కవులు సమాజ శ్రేయస్సును కాంక్షిస్తారని, ఉత్తమ సమాజం ఎలా ఉండాలో సూచిస్తారని, నైతిక విలువతో కూడిన సమాజం ఆరోగ్యకరమైనదిగా భావిస్తారని వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు ఉగాది కవి సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ కవులు సమాజానికి దిశ నిర్దేశనం చేయగలరని నిరంతరం సమాజ శ్రేయస్సు కోసమే తపిస్తారన్నారు. అనంతరం డాక్టర్ భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి, రమణారెడ్డి, కల్లూరు బాల యల్లారెడ్డి, మధుబాబు ఉగాది కవితలను వినిపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సంస్థ పేట్రన్ చంద్రారెడ్డి విజయకుమార్‌బాబు, శివరాం తదితరులు పాల్గొన్నారు.

కృష్ణార్పణం..

● చెరువులు నింపకుండా కాలువ పారించారు
● కుప్పం తరలించేందుకు అధికారుల యాతన
● అలా చూపి ...ఇలా ఆపేశారు
● ఎన్నికల స్టంట్ అంటూ అభివర్ణిస్తున్న జనం



బి. కొత్తకోట శివారులో చుక్కనీరు లేక బోసిపోయిన హంద్రీ-నీవా కాలువ



ఇటీవల కుప్పం వైపుకు ఈ కాలువ గుండా ప్రవహించిన కృష్ణాజలాలు

బి కొత్తకోట, ఏప్రిల్ 7: 'కుప్పంకు కృష్ణాజలాలు తరలించేస్తున్నాం. చెరువులు నింపేస్తాం. వ్యవసాయ భూములు సస్యశ్యామలం చేసేస్తాం.. ఇది మావల్లే సాధ్యం' అని జగన్‌రెడ్డి ప్రభుత్వం బీరాలు పలికినప్పటికీ అది కేవలం ఎన్నికల స్టంట్‌గానే మిగిలిపోయింది అనేది ప్రజలమాట. హంద్రీ-నీవా పుంగనూరు బ్రాంచి కెనాల్ పరిధిలోని తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు నియోజకవర్గాలలో 91 చెరువులకు కాలువద్వారా కృష్ణాజలాలు అందించాల్సివున్నా ఆ ప్రయత్నం ఏదీ జరగలేదు. కుప్పంలో నీటిని చూపితేచాలు అన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చేందుకు హెచ్ ఎన్ఎస్ఎస్ అధికారులు తంటాలుపడుతూ, యాతన అనుభవించారు. వేలకోట్లు ఖర్చు చేసి హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలువను నిర్మించారు. నాలుగేళ్లుగా ఎత్తిపోతల పథకాలు, కాల్వ నిర్వహణకు రూపాయి విదల్చని ప్రభుత్వం ఎన్నికల ఏడాదిలో మరోసారి హంద్రీ-నీవా జలాలను తీసుకొచ్చి హడావిడి చేశారు.

టీడీపీ హయాంలోనే జిల్లాకు హంద్రీ-నీవా జలాలు

హంద్రీ-నీవా సుజల స్రవంతి కర్నూలు జిల్లాలోని శ్రీశైలం ప్రాజెక్టు నుంచి అనంతపురం జిల్లాలోని జీడిపల్లి రిజర్వాయరుకు, అక్కడినుంచి శ్రీసత్యసాయి జిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లి రిజర్వాయరుకు తరలుతుంది. అక్కడినుంచి పుంగనూరు బ్రాంచికెనాల్ ద్వారా అన్నమయ్య, చిత్తూరు జిల్లాల మీదుగా పలమనేరు సమీపంలోని అప్పినపల్లి వద్దకు అక్కడి నుంచి కుప్పం బ్రాంచికెనాల్ ద్వారా పరమసముద్రం వరకు 743 కిలోమీటర్లు ప్రవహించి కుప్పంకు నీరు చేరాల్సివుంది. దీనికోసం 8ప్యాకేజీలు, 38 లిఫ్టులు ఏర్పాటు చేశారు. చెర్లోపల్లి రిజర్వాయరు నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనికి పుంగనూరు బ్రాంచి కెనాల్ ద్వారా టీడీపీ హయాంలోనే నీటిని పారించారు. కొన్ని చెరువులకూ నీటిని విడుదల చేశారు. కాలువనిర్మాణం కోసం మదనపల్లె వద్ద 3కిలోమీటర్ల సొరంగం, కుప్పం ఉపకాలువ కు పలమనేరు బైరెడ్డిపల్లి మండలాల్లో సొరంగాలు తవ్వించారు.

కుప్పం బ్రాంచ్‌కెనాల్‌కు అప్పట్లోనే రూ.144 కోట్లు

పెద్దపంజాణి మండలంలోని అప్పినపల్లి నుంచి ప్రారంభం అయ్యే కుప్పం బ్రాంచ్‌కెనాల్ నిర్మాణం పూర్తి అయినా అదనపు మట్టిపనులు, కాంక్రీటు నిర్మాణాలకు అదనంగా 2018లో జీవో నంబరు 32 తీసుకొచ్చి రూ.144.7 కోట్లు విడుదల చేసింది. దీంతో కుప్పం బ్రాంచి కెనాల్ పనుల విలువ రూ.574 కోట్లకు చేరింది. 123 కి.మీలు సాగే ఈ బ్రాంచ్‌కెనాల్‌పై శంకర్రాయలపేట, పసుపత్తూరు, ఆదినేపల్లి వద్ద ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని పంపింగ్ చేస్తారు.

చెరువులు నింపడంలో చిత్తశుద్ధి ఏదీ..

వైసీపీ హయాంలో రెండుసార్లు హంద్రీ-నీవా నీటిని జిల్లాకు తరలించినా స్థానికంగా ఉన్న చెరువులను నింపాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వంలో కనిపించలేదనే విమర్శలు వున్నాయి. ఎన్నికల నేపథ్యంలో కుప్పంకు తాము ఏదో చేసేశాము అని అక్కడి ఓటర్లకు భ్రమ కల్పించడానికి మాత్రమే హంద్రీ-నీవా జలాలు ఆవిరి అయిపోయాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,80,450ఎకరాలకు సాగునీరు, 15లక్షల మందికి తాగునీరు అందించాలన్నది ప్రాజెక్టు లక్ష్యం. రూ.2,905 కోట్ల అంచనాతో ప్రారంభమై, పూర్తి అయ్యేసరికి 3,900 కోట్లకు పైగా ఖర్చు అయింది. మదనపల్లి డివిజన్‌లో 92 చెరువులను హంద్రీ-నీవా ప్రాజెక్టుకు అనుసంధానం చేయాలని ప్రతిపాదనలు ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వం ఆ దిశగా తీసుకున్న చర్యలు శూన్యం.

కృష్ణా జలాలు గాలికి ఆవిరి..

చెర్లోపల్లి రిజర్వాయరు నుంచి 7 లిఫ్టుల ద్వారా పుంగనూరు బ్రాంచి కెనాల్ మీదుగా అప్పినపల్లెకు, అక్కడి నుంచి కుప్పం ప్రాంతంలోని పరమసముద్రం చెరువుకు నీటిని తరలించేందుకు రెండునెలలు పట్టింది. ఎండవేడికి నీరు ఆవిరి అయిపోవడం, కాలువలో ఇంకిపోవడంతో చెర్లోపల్లినుంచి 150-200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినా కుప్పంకు 10 క్యూసెక్కులు కూడా చేరలేదు. సుమారు 400కి.మీ.లు దూరం ప్రవహించాల్సివున్నందున నీరు వేగంగా ముందుకు సాగలేదు. చెర్లోపల్లి రిజర్వాయరు నీటినిల్వ సామర్థ్యం 1.618టీయంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 0.4 టీయంసీలకు పడిపోయింది. శ్రీశైలం నుంచి నీటి లభ్యత తగ్గడంతో లిఫ్టింగ్‌ను ఆపేశారు. కుప్పం చేరిన నీరు సీయం పర్యటన హడావిడి మాత్రమే కనిపించి ఆ తర్వాత కాలువ బోసిపోయింది.

వైసీపీ రౌడీ రాజకీయాలు మానుకోవాలి

నేరస్తులను శిక్షించాలి ● ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

పెండ్లిమర్రి, ఏప్రిల్ 7: ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని, రౌడీ రాజకీయాలు మానుకోవాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం పెండ్లిమర్రి మండలం నందిమండలం గ్రామం లో జరిగిన న్యాయ యాత్రలో వైఎస్ షర్మిల, కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి గాలి చంద్ర మాట్లాడారు. వైఎస్ షర్మిల మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు కావస్తున్నా జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ఊసే లేదన్నారు. ఎవరికీ ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. 175 నియోజక వర్గాలలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గం కమలాపురం అన్నారు. చాలా గ్రామాలకు కనీసం రోడ్లు కూడా లేని పరిస్థితి ఉందన్నారు. అంతేకాకుండా వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఎవరైనా ఎదురుతిరిగితే వారిని హత్య చేసి చంపుతున్న పరిస్థితి జిల్లాలో ఏర్పడిందన్నారు. యాదవాపురం గ్రామానికి చెందిన బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన ఆదిమూలం శ్రీనివాస్‌యాదవ్‌ను ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అనుచరులు అత్యంత కిరాతకంగా హత్య చేసి చంపటం బాధాకరమన్నారు. ఇలాంటి సంఘటనలు అనేకం జరుగుతున్నా పోలీసు యంత్రాంగం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందని, వారికి ప్రాణహాని ఉందని గతంలో కలెక్టర్, పోలీసులకు విన్నవించుకున్నా వారి నిర్లక్ష్యం వల్లే శ్రీనివాస్ హత్యకు గురయ్యాడన్నారు. ఐదేళ్లు అవుతున్నా వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులకు శిక్ష పడలేదని, జగన్ సొంత చిన్నాన్న హత్య కేసులో నిందితులుగా ఉన్న వైఎస్ అవినాష్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇవ్వడం పనికిమాలిన చర్య అన్నారు. కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి గాలి చంద్ర, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఓబులేసు మాట్లాడుతూ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చేపల చెరువు కోసం అధికారాన్ని అడ్డుపెట్టుకొని నీళ్లను తీసుకుపోతున్న పరిస్థితి ఉందన్నారు. చెన్నూరు చక్కర పరిశ్రమ మూసివేసి తెరిపిస్తామని చెబుతున్నా ఇంత వరకు తెరిపించిన పరిస్థితి లేదన్నారు.

నేరస్తులను శిక్షించాలి

భూ వివాదంతో హత్యకు గురైన ఆదిమూలం శ్రీనివాసులును హత్య చేసిన నేరస్తులకు శిక్షపడాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఏ1, ఏ2లను వదిలేసి మిగిలిన ఐదుగురు నిందితులను అరెస్టు చూపడం ఏమిటన్నారు. పోలీసులు హత్య కేసులో ఉన్న ఏ1 చిన్నపుల్లారెడ్డి, ఏ2 నాగపుల్లారెడ్డిని తప్పించే ప్రయత్నం చేస్తున్నారని, వారిని శిక్షించే వరకు పోరాటం చేస్తామన్నారు. బాధితులు ప్రాణహాని ఉందని ముందే తెలియజేసినా రక్షణ కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



శ్రీనివాసయాదవ్ కుటుంబాన్ని ఓదార్చుతున్న వైఎస్ షర్మిల

ఆశీర్వదించండి... అండగా ఉంటా

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 7: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కడప పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్నానని తనను ఆశీర్వదించి గెలిపిస్తే అండగా నిలుస్తానని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం వీరపునాయునిపల్లెలోని మూడురోడ్ల కూడలిలో ఆమె మాట్లాడారు. కడప ఎంపీగా పోటీ చేయాలని ఐదేళ్లక్రితం చిన్నాన్న నన్ను బతిమాలాడాడని, ఆరోజు ఒప్పుకుని ఉంటే ఈ ఘోరం జరిగేది కాదన్నారు. సొంత చిన్నాన్నని హత్య చేస్తే సీఎం జగన్ కేసును పట్టించుకోలేదన్నారు. హంతకులకు శిక్షపడేలా చూడలేదన్నారు. అలాగే కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న గాలి చంద్రను గెలిపించాలని కోరారు. అనంతరం వైఎస్ సునీతరెడ్డి మాట్లాడుతూ తన తండ్రి వైఎస్ వివేకానందరెడ్డిని దారుణంగా హత్య చేస్తే ఇంతవరకు న్యాయం జరగలేదన్నారు. న్యాయపోరాటంలో తనకు అండగా నిలిచిన వైఎస్ షర్మిలకు ఓటు వేసి గెలిపిస్తే ప్రజలందరికి న్యాయం జరుగుతుందన్నారు. పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, సీపీఐ నేత ఓబులేసు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏపీకి ప్రత్యేక హోదా

కమలాపురం రూరల్, ఏప్రిల్ 7 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏపీ మొదటగా ప్రత్యేకహోదా తెప్పిస్తామని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. కమలాపురం నగర పంచాయతీలోని చిన్నచౌకు వద్దకు వైఎస్ షర్మిల బస్సుయాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని చెబితే ప్రజలు నమ్మి ఓటు వేసి సీఎంను చేస్తే హోదాగురించి మాట్లాడకుండా ప్రజలను మోసం చేశాడన్నారు.

సీబీఐ విచారణ అంటేనే జగన్‌కు భయం

● వైఎస్ షర్మిలారెడ్డి

కడప చెన్నూరు, ఏప్రిల్ 7:ఐదేళ్ల క్రితం అత్యంత సౌమ్యుడు అయిన వైఎస్ వివేకానందరెడ్డిని అత్యంత దారుణంగా నరికి చంపిన వ్యక్తికి మళ్లీ కడప ఎంపీ టికెట్టు ఇవ్వడం ఇంతకన్నా దారుణం మరొకటి ఉంటుందా అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ధ్వజమెత్తారు. శనివారం రాత్రి చెన్నూరు రోడ్‌షోలో ఆమె మాట్లాడుతూ వైఎస్ ఆశయాలను నెత్తికెత్తుకుని జగన్ గెలుపు కోసం 3200 కిలోమీటర్లు పాదయాత్ర చేస్తే నాకే మేలు చేయని వ్యక్తి ఇక రాష్ట్ర ప్రజలకు ఏమి చేస్తారని ఆమె పేర్కొన్నారు. ప్రజలు ఇప్పటికైనా నిజానిజాలు తెలుసుకుని న్యాయం వైపా, అన్యాయం వైపా అనేది నిర్ధారించుకోవాలని కోరారు. మద్యపాన నిషేధం చేస్తానని చివరికి ప్రభుత్వం ద్వారానే మద్యం షాపులు నడపడం సిగ్గుచేటన్నారు. మొత్తం కల్తీ బ్రాండ్లేనన్నారు. వివేకాను హత్యచేసిన వ్యక్తిని వెంటబెట్టుకుని ప్రచారం చేయడం ఇంతకన్నా ఘోరం మరొకటి ఉంటుందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ తులసిరెడ్డి, కమలాపురం అసెంబ్లీ అభ్యర్థి గాలి చంద్ర, సీపీఐ రాష్ట్ర నాయకుడు ఓబులేసు పాల్గొన్నారు.

టీడీపీలో భారీ చేరికలు



టీడీపీలో చేరిన స్థానికులతో పుత్తా చైతన్యరెడ్డి, వికాస్ హరిక్రిష్ణ

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 7 :కమలాపురం నియోజకవర్గంలోని ఊటుకూరులో ఆదివారం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఊటుకూరులోని పాత హరిజనవాడలో సీనియర్ నాయకుడు రెడ్డయ్య, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిక్రిష్ణ ఆధ్వర్యంలో కొత్తగా ఓట్లు నమోదు చేసుకున్న 30 మంది యువత చైతన్యరెడ్డికి మద్దతు తెలుపుతూ పార్టీలో చేరా రు. వారికి పుత్తా చైతన్యరెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. యువత అందరూ కూడా టీడీపీకి మద్దతు తెలపాలని కోరారు.

మూల్యాంకన నిధులు ఏడాదైనా చెల్లించరా?

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 7 : గత ఏడాది పదో తరగతి పరీక్షలు సప్లిమెంటరీ పరక్షలు మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు చాలా జిల్లాల్లో పూర్తిస్థాయిలో టీఏ, డీఏ పరీక్ష పత్రాల మూల్యాంకన నిధులు చెల్లించలేదని ఎస్టీయు రాష్ట ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాధరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల మూల్యాంకన విధులు నిర్వర్తించి సంవత్సరం అయిన ఎందుకు పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయడంలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఈ సంవత్సరం మూల్యాంకన విధులు పూర్తయ్యేలోగా గత సంవత్సరం బకాయలు ఈ సంవత్సరంవి కలిపి మొత్తం చెల్లింపులు చేయాలన్నారు.


సోషల్ మీడియాలో అవాస్తవాలు, అసత్యాలు ప్రచారం చేసే వారిపై నిఘా: డీఎస్పీ

కడప (క్రైం), ఏప్రిల్ 7 :సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కడప డీఎస్పీ ఎస్ఎండీ షరీఫ్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం డీఎస్పీ ఓ ప్రకటన విడుదల చేశారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య విద్వేషాలు రగిల్చే విధంగా సోషల్ మీడియా వేదికగా పరస్పర విమర్శలు, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు, పరస్పర విమర్శలు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు పెట్టేవారిపై సైబర్ సెల్ సోషల్ మీడియా విభాగం నిఘా ఉంచామని, సదరు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవాస్తవ ప్రచారాన్ని ప్రజలు ఎవరూ నమ్మవద్దని డీఎస్పీ సూచించారు. ఫేక్ న్యూస్ వ్యాప్తి ఫార్వర్డ్ చేసే వారిపై నిఘా ఉంచామని, నిజానిజాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో పోస్టు చేసే వారిపై, షేర్ చేసే వారిపై, సంబంధిత గ్రూప్ అడ్మిన్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. ఏమైనా సమస్యలుంటే పోలీసు అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటారిన, వారి దృష్టికి తీసుకువచ్చి సమస్యలు, సమాచారంపై అనుమానాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు.

51 మద్యం బాటిళ్లు స్వాధీనం

వల్లూరు, ఏప్రిల్ 7 :మండల పరిధిలోని గణేశ్‌పురం వద్ద అక్రమంగా మద్యం కలిగి ఉన్నాడని సమాచారం రావడంతో ఎస్ఐ కత్తి వెంకటరమణ తన సిబ్బందితో దాడి చేసి అతని వద్ద 51 ఉన్న మద్యం బాటళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

గంగమ్మతల్లికి ఘనంగా పూజలు



శాకాంబరిదేవి అలంకారంలో గంగమ్మతల్లి

సీకేదిన్నె, ఏప్రిల్ 7:చింతకొమ్మదిన్నె మం డలం కొత్తపేట గంగమ్మ తల్లికి భక్తులు ఘ నంగా పూజలు నిర్వహించారు. 4వ ఆదివారం సందర్భంగా గంగమ్మ తల్లికి శాకాంబరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చా రు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయానికి భక్తులు అధి క సంఖ్యలో హాజరుకావడంతో క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈవో సురేష్‌కుమార్‌రెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారి సన్నిధిలో విందుభోజనాలు ఏర్పాటు చేసుకుని ఆనందంగా బంధుమిత్రులతో గడిపారు.

ఏపీజీఎల్ఐ నూతన వెబ్‌సైట్‌ను విస్తృత పరచాలి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 7 : ఏపీజీఎల్ఐ నూతన ఆన్‌లైన్ వెబ్‌సైట్ సౌకర్యాలను మరింత విస్తృత పరచాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు.

సర్వీసు మధ్యలో పరిణితి చెందుతున్న బాండ్లను పదవీ విరమణ నాటికి పొడిగించి ఇన్సూరెన్స్ విలువను పెంపుదల చేయాలని, పాలసీ చెల్లింపులతో పాటు ఆయా ఆర్థిక సంవత్సరాల్లో జమ అయిన బోనస్ వివరాలను కూడా వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరారు. నిది సైట్‌తో ఏపీజీఎల్ఐ వివరాలు అనుసంధానం చేసియున్నందున ఆన్‌లైన్ వేతనాల ద్వారా ఏపీజీఎల్ఐ మినహాయింపు జరుగుతూ ఉన్నందున మిస్ క్రెడిట్‌కు అవకాశం లేకుండా ఇన్సూరెన్స్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

సల్లంగ చూడవే గంగమ్మ తల్లీ

● చెన్నూరులో వైభవంగా గంగజాతర ● పెద్ద సంఖ్యలో హాజరైన జనం ● కష్టాలు తీర్చాలని ప్రత్యేక పూజలు

చెన్నూరు, ఏప్రిల్ 7 : సల్లంగ చూడవే గంగమ్మ తల్లీ అంటూ భక్తులు అమ్మవారికి ప్రార్థించారు. గంగజాతర ఆదివారం చెన్నూరులో వైభవంగా జరిగింది. ప్రతి యేటా ఉగాదికి ముందు వచ్చే ఆదివారం రోజు గంగ జాతర చెన్నూరులో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. స్థానిక తూర్పువీధిలోని ఖాళీ స్థలంలో అమ్మవారిని ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహిస్తారు.

అలాగే ఈ మారు కూడా తూర్పువీధిలో అమ్మవారిని ప్రతిష్ఠించి వైభవంగా ఉత్సవాలు నిర్వహించారు. అంతకు ముందే శనివారం అర్థరాత్రి దాటిన తరువాత అమ్మవారిని ప్రతిష్ఠించే ముందు మట్టితో గంగమ్మ, గౌరమ్మ ప్రతిమలను తయారు చేసి గ్రా మ పొలిమేరల్లో బలులు సమర్పించారు. జంతువుల రక్తంతో అన్నం ముద్దలు చెన్నూరు నాలుగు దిక్కులా పొలిమేరల్లో చలిజాతర ప్రారంభించారు. తెల్లవారుజామున 3గంటలకు గంగమ్మ, గౌరమ్మలను ప్రతిష్ఠించడంతో ప్రజలు అప్పటి నుంచే అమ్మవార్లకు జంతుబలులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మహిళలు కూడా ఉద యం 5గంటల నుంచే అమ్మవారి వద్దకు వెళ్లి బోనాలు సమర్పించారు.

కిక్కిరిసిన అమ్మవారి ప్రతిష్ఠ ప్రాంతం

జాతర సందర్భంగా ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 వరకు గంగమ్మ,గౌరమ్మలను నిలిపిన ప్రాంతం ప్రజలతో కిక్కిరిసిపోయింది. అలాగే సాయంత్రం 4 నుంచి రాత్రి 10 వరకు తూర్పువీధికి వెళ్లే దారి మొత్తం అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రజలతో సందడిగా మారింది. ఆ ప్రాంతం మొత్తం ప్రజాసంద్రం కావడంతో సీఐ ఆధ్వర్యంలో బందోబస్తుతో పాటు కడప డీఎస్పీ షరీఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సిబ్బందిని కూడా బందోబస్తు ఏర్పాటు చేశారు. అంతేకాక పందిళ్లు, షామియానాలు, విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. గత ఏడాది కన్నా ఈమారు జాతర జరిగే ప్రాంతమంతా అత్యధికంగా జన సంద్రమైంది. గ్రామ పెద్దలు సైతం అమ్మవారి దర్శనానికి వచ్చే వారి కోసం అవసరమైన ఏర్పాట్లన్నీ చేశారు.





చెన్నూరు జాతర ప్రాంతంలో జనసందోహం... జాతరలో కొలువుదీరిన గంగమ్మ, గౌరమ్మ

పలువురిని కలిసిన డాక్టర్ వైఎస్ సునీత

పులివెందుల, ఏప్రిల్ 7: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత ఆదివారం పలువురిని కలిశారు. వేంపల్లె పట్టణంలోని డాక్టర్ బాష ఇంటికెళ్లి ఆయనతో చర్చించారు. ఆయనతో పాటు శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ ఆయన లేకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అలాగే వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి ఇంటికి వెళ్లారు ఆయన లేకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి డాక్టర్ సునీతతో మాట్లాడింది. దీంతో ఆమె స్పందిస్తూ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డికి వీరు ముగ్గురు ఎంతో ఇష్టమైనవారని, వారి కుటుంబ సభ్యులతో కూడా మా కుటుంబానికి మంచి సాన్నిహిత్యం ఉందన్నారు. ప్రచారానికి వెళ్లి వస్తూ వీరిని కలిసేందుకు వారి ఇంటికి వెళ్లానన్నారు. డాక్టర్ బాష ఇంట్లో ఉండడంతో ఆయనను కలిశానన్నారు. సతీష్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి లేకపోవడంతో వారి కుటంబ సభ్యులతో మాట్లాడి వచ్చానన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కడప ఎంపీ స్థానానికి బరిలో దిగడంతో ఆమెకు మద్దతు కోరేందుకు వారి ఇంటికి వెళ్లినట్లు తెలుస్తోంది.

హిందువులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కడప (కల్చరల్) ఏప్రిల్ 7: హిందువులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం జిల్లా నాయకుడు గుండ్లపూడి సుధాకర్‌శర్మ డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

'కేజ్రీవాల్ అక్రమ అరెస్టుతో బీజేపీ పతనం తథ్యం'

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 7: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్ట్‌తో బీజేపీ పతనం తథ్యమని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాదిక్ హుస్సేన్, జిల్లా కన్వీనర్ తిరుమలరెడ్డి పేర్కొన్నారు. కేజ్రీవాల్ అక్రమ అరెస్టుకు నిరసనగా పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం స్థానిక గడ్డిబజార్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శాంతియుత ఉపవాస దీక్ష చేపట్టారు. ఆమ్ ఆద్మీపార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి దస్తగిరి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆరిఫ్, జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వడ్డెర సోదరులకు టీడీపీ అండగా ఉంటుంది

● పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 7 : వడ్డెర సోదరులకు టీడీపీ అండగా ఉంటుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి అన్నారు. ఆదివారం కడప నగరం రాజేశ్వరి కళ్యాణ మండపంలో వడ్డెర సోదర సోదరీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. అన్ని కులాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని తెలిపారు. ఏ కార్పొరేషన్‌కు కూడా నిధులు కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కులానికొక కార్పొరేషన్ పెట్టి నిర్వీర్యం చేసిన విషయం గుర్తు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అన్ని కార్పొరేషన్లు బలోపేతం చేసి నిధులు కేటాయించి అందరికీ గుర్తింపు ఇస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఎంపీ అభ్యర్థి భూపేష్, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్‌లు మాట్లాడారు.

టీడీపీ విజయానికి సహకరించండి: మాధవీరెడ్డి

జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కడప నగరం 48వ డివిజన్ చౌటపల్లెలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎటు చూసినా అరాచకాలే కనబడుతున్నాయి కానీ అభివృద్ధి ఎక్కడా కానరావడం లేదన్నారు. ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివారెడ్డి, యల్లారెడ్డి, వీరారెడ్డి, సూరారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, జనార్ధనరెడ్డి, రామచంద్రరెడ్డి, ఓబులేసు, ఓబయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కడప నగరంలో తాగునీటి ఎద్దడి నివారించండి

● టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి



మాట్లాడుతున్న శివకొండారెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 7 : కడప నగరంలో అనేక చోట్ల తాగునీటి సమస్య అధికంగా ఉందని, నగర ప్రజలు నీటి ఎద్దడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణం ఈ సమస్యను నివారించాలని టీడీపీ నగర అధ్యక్షులు సానపురెడ్డి శివకొండారెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం 28వ డివిజన్ టీడీపీ కార్యాలయంలో ఆ యన విలేకరులతో మాట్లాడుతూ నీటి ఎద్దడి వల్ల ఐదురోజులకొకసారి నీరు వస్తుందని తాగునీరు సక్రమంగా రాక మురికినీరు అనేక చోట్లవస్తుందన్నారు. కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి శుభ్రమైన నీటిని అందించాలని కోరారు. అలాగే నగరంలో దోమల బెడద నుండి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జలతోటి జయకుమార్, గాజులపల్లె రాఘవ, మురికినాటి రామాంజనేయులు, నారాయణ పాల్గొన్నారు.

డయాబెటిస్ సెంటరును ప్రారంభించడం అభినందనీయం

● టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్‌హరిక్రిష్ణ



డాక్టర్ తస్నీంను అభినందిస్తున్న వికాస్‌హరిక్రిష్ణ

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 7:కడప నగరం ఎర్రముక్కపల్లెలో డాక్టర్ షేక్ తస్నీం డయాబెటిక్ సెంటరును ప్రారంభించడం అభినందనీయమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ తెలిపారు. ఆదివారం కడప ఎర్రముక్కపల్లె ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న హాస్పిటల్‌లో డాక్టర్ షేక్ తస్లింను కలిసి పూల బోకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లావాసులకు మెరుగైన సేవలను అందివ్వాలని కోరారు. వికాస్ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు హమీద్, పరీద్, అనిల్ పాల్గొన్నారు.


టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించండి



టీడీపీ నేతలకు స్వాగతం పలుకుతున్న ప్రజలు


సీకేదిన్నె, ఏప్రిల్ 7: తెలుగు దేశం పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి కోరారు. చింతకొమ్మదిన్నె మండలం కార్పొరేషన్‌లో విలీనమైన ఊటుకూరులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టి ఇంటింటికి తిరిగి టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ప్రణాళికలు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ రెండు ఓట్లు టీడీపీకే వేయాలన్నారు. వైసీపీ నుంచి గోసుల రాజగోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, దుప్పిరెడ్డి గంగిరెడ్డి, గుర్రాల రెడ్డన్న ఆధ్వర్యంలో టీడీపీలో వైసీపీ నుండి 70 కుటుంబాలు చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు సూ పర్-6 పథకాలు ఇంటింటికి వివరిస్తూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, చదువుతున్న ప్రతి ఒక్కరికి అమ్మఒడి, 18 సంవత్సరాలు నిండిన మహిళలకు నెలకు రూ.1500, వృద్ధాప్య పింఛన్ రూ.4 వేలు, ఏప్రిల్ నుండి ఇస్తామని పెంచి అధికారం చేపట్టిన వెంటనే జూన్‌లో మూడు నెలలది ఒకేసారి అందించడం జరుగుతుందన్నారు. నెలకు 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, తదితర పథకాలు ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పుత్తా నరసింహారెడ్డి అల్లుడు యశ్వంత్‌రెడ్డి, పుత్తా సాయి నరసింహారెడ్డి, మండల ఇన్‌చార్జి టి.వి.కృష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, మాజీ సర్పంచ్ సుబ్బిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసులు, డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, బీజేపీ జనసేన నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, వేణు, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

చిన్నచౌకు పరిధిలో ఫ్లాగ్‌మార్చ్



కడప (క్రైం), ఏప్రిల్ 7 : నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి అంటూ కడప నగరం చిన్నచౌకు పోలీసుస్టేష్ పరిధిలో సీఐ నరసింహారెడ్డి కేంద్ర సాయుధ బలగాలతో ఆదివారం చిన్నచౌకు పురవీధుల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు కడప చిన్నచౌకు పోలీసు స్టేషన్ పరిధిలో సీఐ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ రవికుమార్ పోలీసు సిబ్బంది, కేంద్ర సశస్త్ర సీమాబల్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని పాత బైపాస్, అశోక్‌నగర్, నెహ్రూనగర్, అప్సర సర్కిల్, ఎన్జీవోకాలనీ, వైజంక్షన్‌ప్రాంతాల మీదుగా ఫ్లాగ్ మార్చ్ చేస్తూ ప్రజలకు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని భరోసా కల్పించారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసులు ప్రజలకు భరోసా కల్పించారు. ప్రజల్లో ఉన్నభయాందోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని ప్రజల్లో భరోసా కల్పించారు.

అభివృద్ధి చేసే టీడీపీకి ఓట్లు వేయండి



గిడ్డంగివారిపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న రఘునాథరెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 7: రాష్ట్రాన్ని అభివృద్ధివైపునకు తీసుకెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే టీడీపీ ప్రభుత్వం వచ్చేందుకు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి అన్నారు. మండలంలోని గిడ్డంగివారి పల్లె, అశోక్‌నగర్ గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ఆదివారం ప్రచారం నిర్వహించారు. కూటమికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ గ్రామ నాయకులు సుధాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, ఎస్‌బి జయరామిరెడ్డి, మండల కన్వీనర్ మునిరెడ్డి, రెడ్డికిషోర్, నామా వేమకుమార్, డక్కా రమేష్, వీరలింగేశ్వర్‌రెడ్డి, మహమ్మద్, మడక శ్రీనివాసులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు న్యాయం




ప్రొద్దుటూరులో వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన 34 వవార్డు యువకులు, మైదుకూరులో పుట్టా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 7 : టీడీపీతోనే యువతకు న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయం క్యాంపులో 34 వవార్డుకు చెందిన చిట్టే వీరప్రతాప్ ఆధ్వర్యంలో పలువురు యువకులు టీడీపీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి, కాటంవంశీ, వినోద్‌కుమార్, బోదీనా సత్యనారాయణ, అంపావతిన కంబగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు మారుతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కొత్తపల్లె పంచాయతీలోని వివేకానంద కాలనీలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీనుంచి టీడీపీలోకి 50 కుటుంబాలు చేరాయి. వీరందరికీ మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వీఎస్ ముక్తియార్, వంగనూరు మురళీధర్‌రెడ్డి, మునీర్, కొత్తపల్లె ఎంపీటీసీ సౌభాగ్యమ్మ, ఈవీ సుధాకర్‌రెడ్డి , చల్లా రాజగోపాల్ యాదవ్, కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, హసీనా, గంగాధర్ జనసేన ప్రతినిధులు పత్తి శివకల్యాణ్ పాల్గొన్నారు.

మైదుకూరు..: మైదుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో ఆదివారం మున్సిపల్ పరిధిలోని పలువురు వైసీపీ నాయకులు టీడీపీ కండువా వేసుకున్నారు. మూలబాట వీధికి చెందిన బండి లక్ష్మయ్య, సురేష్ అనుచరులకు చెందిన దాదాపు 40 కుటుంబాలకు చెందిన వారిని ఆయన టీడీపీలోకి చేర్చుకున్నారు. అలాగే మున్సిపల్ పరిధిలోని చిన్నయ్యగారిపల్లెలో 2వ వార్డు మాజీ కౌన్సిలరు బ్రహ్మానందరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, వాసుదేవరెడ్డి, ఈశ్వరరెడ్డి, క్రిష్టారెడ్డి తదితరులకు చెందిన దాదాపు 40 కుటుంబాల వారు కూడా టీడీపీలోకి చేరారు. కాగా మండలంలోని వనిపెంటలో ఎస్సీ కాలనీలో సోలమాన్, శ్యామ్, మహేష్, రవి, అజయ్ తదితరులు కూడా టీడీపీలోకి చేరారు. ఈ కార్యక్రమాలల్లో టీడీపీ పట్టణ, మండల అధ్యక్షుడు దాసరి బాబు, భీమయ్య, ధనపాల జగన్, బీయన్ శ్రీనివాసులు, ద్వార్సల గురివిరెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, కటారి క్రిష్ణ, కొప్పర్తి మధు తదితరులతో పాటు జనసేన నాయకులు మల్హోత్ర పాల్గొన్నారు.

వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక

బ్రహ్మంగారిమఠం..: బ్రహ్మంగారిమఠం మండలంలోని దిగువ నేలటూరు, ఎగువ నేలటూరు, మలుగుడుపాడు, గోపిరెడ్డిపల్లె, బూదవాడ, రాజుపేట గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు 150 కుటుంబాలు పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో చేరారు. వీరిలో దిగువ నేలటూరు వైసీపీ నాయకులు మాజీ సర్పంచ్ మణ్యం శ్రీదేవమ్మ కుమారులు మణ్యం నాగేశ్వర్‌రెడ్డి, మణ్యం రవిశంకర్‌రెడ్డి, మణ్యం మల్లికార్జునరెడ్డి వారి అనుచర వర్గం ఎగువ నేలటూరు గ్రామంలో నాగమునెయ్య, దశరథ, సుబ్బరాయుడు, సుబ్బయ్య, సంపత్ వారి అనుచరవర్గం, గోపిరెడ్డిపల్లె గ్రామంలో రమణ వారి అనుచరవర్గం, బూదవాడ గ్రామంలో భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి, విష్ణు, సుబ్బారెడ్డి వారి అనుచరవర్గం, మలుగుడుపాడు గ్రామంలో భాస్కర్, బాలశౌరి, చక్రవర్తి, చిరంజీవి వారి అనుచర వర్గంతో పాటు రాజుపేట గ్రామం నుంచి 30 కుటుంబాలుతో సహా మొత్తం 150 కుటుంబాలు పుట్టా సుధాకరయాదవ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన మణ్యం నాగేశ్వర్‌రెడ్డి, మణ్యం రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ కార్యకర్తలు రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి ఓట్లు వేసే పరిస్థితుల్లో లేరన్నారు. నమ్మినవారినే నట్టేట ముంచేస్తాడన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షు డు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ముద్దుక్రిష్ణమనాయుడు, ముడుమాల పోలిరెడ్డి సాంబశివారెడ్డి, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు పెసల ఈశ్వర్‌రెడ్డి, బీమానాయుడు, మాజీ ఎంపీటీసీ రమేశ్, బద్రి శివ, పుల్లయ్యనాయుడు, మోపూరి రమణ, కొండాఓబయ్య, మిల్లు శ్రీను, సర్పంచ్ నారాయణ, చిలమల నాగయ్య, ఐదు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..: ప్రొద్దుటూరు టీడీపీ కార్యాలయంలో ఆదివారం మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో వనిపెంట ఎస్సీ కాలనీకి చెందిన సాల్మన్,శ్యామ్,మహేష్, ప్రసన్నకుమార్, చెన్నయ్య,అనుఖ్,రవి,అజయ్ తదితరులు స్వచ్ఛందంగా పార్టీ కండువాలు కప్పుకొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు భీమయ్య పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 7: మహమ్మదీయ కాలనీకి చెందిన స్వర్ణకారుడు షేక్ షబ్బీర్‌హుస్సేన్, ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో 300 మందికి రంజాన్‌తోఫా పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం కులమతాలకు అతీతంగా పేదలకు నూతన దుస్తులు, బియ్యం, చక్కెర, గోధుమపిండి, సేమియాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.దాన్, ఖాజాహుస్సేన్, సమద్, సమీవుల్లా, ఫయాజ్, జావీదు, అబ్దుల్‌రెహమాన్, జాకీర్, పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 7 : ఆరోగ్యం కాపాడు కోవడం మనిషి జీవితంలో అత్యంత ప్రధానం కావాలని డాక్టర్ బద్వేలి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సిర్డ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బుడ్డాయిపల్లె లోని బీసీ బాలికల హాస్టల్‌ల్లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ అధికారి సత్యవతి , ఆరోగ్యకార్యకర్త పెంచలయ్య, హెల్త్ సెక్రటరీ రెబెకా ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీలకు సీట్లు కేటాయించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 7: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో క్రిస్టియన్ మైనార్టీలకు రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని సీఎస్ఐ చర్చి రాయలసీమ డయాసిస్ మాజీ ఇంజనీరు ప్రసాద్‌జయకుమార్ పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం చట్టసభలలో క్రిస్టియన్ మైనార్టీలకు ఒక శాతం రిజర్వేషన్ ఉన్నా సీట్లు కేటాయించడంలో రాజకీయ పార్టీలు విఫలం అవుతున్నాయని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నవెంకటస్వామి, మణిప్రకాశం, పాల్గొన్నారు.

ఓటరు స్వచ్ఛందంగా ఓటు వేసుకోవాలి

ఖాజీపేట, ఏప్రిల్ 7: ప్రతి ఓటరూ స్వచ్ఛందంగా పోలింగ్‌బూత్‌కు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ రామాంజులు తెలిపారు. ఆదివారం మండల పరిధిలో ఖాజీపేట, సుంకేసుల, ఖాదర్‌పల్లె, దుంపలగట్టు, ఏటూరు, మిడుతూరు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలన్నారు.

ఏడాదైనా మూల్యాంకన నిధులు చెల్లించరా..?

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 7 : గత ఏడాది పదో తరగతి పరీక్షలు సప్లిమెంటరీ పరక్షలు మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు చాలా జిల్లాల్లో పూర్తిస్థాయిలో టీఏ, డీఏ పరీక్ష పత్రాల మూల్యాంకన నిధులు చెల్లించలేదని ఎస్టీయు రాష్ట ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల మూల్యాంకన విధులు నిర్వర్తించి సంవత్సరం అయిన ఎందుకు పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయడంలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఈ సంవత్సరం మూల్యాంకన విధులు పూర్తయ్యేలోగా గత సంవత్సరం బకాయలు ఈ సంవత్సరంవి కలిపి మొత్తం చెల్లింపులు చేయాలన్నారు.

కడప నగరంలో తాగునీటి ఎద్దడి నివారించండి

● టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 7 : కడప నగరంలో అనేక చోట్ల తాగునీటి సమస్య అధికంగా ఉం దని, నగర ప్రజలు నీటి ఎద్దడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణం ఈ సమస్యను నివారించాలని టీడీపీ నగర అధ్యక్షులు సానపురెడ్డి శివకొండారెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం 28వ డివిజన్ టీడీపీ కార్యాలయంలో ఆ యన విలేకరులతో మాట్లాడుతూ నీటి ఎద్దడి వల్ల ఐదురోజులకొకసారి నీరు వస్తుందని తాగు నీరు సక్రమంగా రాక మురికినీరు అనేక చోట్లవస్తుందన్నారు. కార్పోరేషన్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి శుభ్రమైన నీటిని అందించాలని కోరారు. టీడీపీ నాయకులుజలతోటి జయకుమార్, గాజులపల్లె రాఘవ, మురికినాటి రామాంజనేయులు, నారాయణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జానపదగీతాలు

కడప (కల్చరల్) ఏప్రిల్ 7: నగర రిమ్స్ సమీప శిల్పారామం సాంస్కృతిక కళావేదిక మీద సంబంధిత పరిపాలనాధికారి పి. శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో బద్వేల్ నగరానికి చెందిన అనూష్ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు వివిధ జానపద, సినీ, శాస్త్రీయ గీతాలకు చేసిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇందులో చిత్తూరు చినదాన... నీ మనసులో నేలేనా.....అందమైన దానా.. చందమామ లాంటి దానా జానపద గీతాలకు కళాకారులు వేసిన స్టెప్స్‌కు ప్రేక్షకులు ఈలలేశారు.

ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

జమ్మలమడుగు, ఏప్రిల్ 7: ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో కొత్తమాధవరం గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న పాలా సుబ్బారావు, పద్మశాలీ కుటుంబానికి రూ.52 వేలు ఆర్థికసాయం అందించినట్లు జమ్మలమడుగు పద్మశాలీ సంఘం నాయకుడు రుద్రమహేశ్వరుడు తెలిపారు. ఆదివారం అనంతపురం పద్మశాలీ సంక్షేమ సంఘం మార్కండేయ దేవస్థానం అధ్యక్షుడు రాజశేఖర్, జమ్మలమడుగు బావనారుషి దేవాలయం పద్మశాలీ సంఘం శీలా బాలాజీ, శిలివేరు గిరిధర్, కదిరి పద్మశాలీ సంఘం కన్వీనర్ మద్దిలేటిస్వామి, తదితర నాయకులు ఆ కుటుంబానికి ఆర్థికసాయం అందించినట్లు వారు తెలిపారు. ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబానికి ప్రభుత్వ ఆర్థికసాయం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వద్ది నాగేంద్ర, జగ్గారపు శ్రీనివాసరావు, మునగపాటి వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, శిలివేరు దశరథ రామయ్య, శిలివేరు వెంకటేశ్వరులు, వైఎస్ఆర్ జిల్లా ఏపీపీఎస్ అధ్యక్షుడు చింతపల్లె రుద్రమహేశ్వరుడు పాల్గొన్నారు.

మేధావులు, ప్రజలు మేల్కోవాలి



ప్రజాస్వామ్యం - ఎన్నికలు అంశంపై మాట్లాడుతున్న వక్తలు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 7 : మేధావులు, ప్రజలు మేల్కోవాలని రాష్ట్రఅభ్యుదయ వేదిక ప్రధాన కార్యద ర్శి సింగారెడ్డి హనుమంతురెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకరయ్య అన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో అఖిల భారత అభ్యుదయ వేదిక కడప శాఖ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యం - ఎన్నికలు అన్న అంశంపై చర్చ కారక్రమం ఏర్పాటు చేశారు. ఈ చర్చలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికలు ఆర్థిక అంశాలపై కులాలు మతాల ప్రభావం ఎక్కువగా ఉందని అన్నారు. కౌన్సిల్ సభ్యుడు సురేష్‌బాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో మార్కారెడ్డి, రిటైర్డ్ ఎంఈవోలు రత్నస్వామి, నిర్మల, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి రమణారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు చంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, బాలరాజు, పుల్లయ్య, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

అవాస్తవాలు, అసత్యాలు ప్రచారం చేసే వారిపై నిఘా

కడప డీఎస్పీ ఎస్ఎండీ షరీఫ్

కడప (క్రైం), ఏప్రిల్ 7 : సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కడప డీఎస్పీ ఎస్ఎండీ షరీఫ్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం డీఎస్పీ ప్రకటన విడుదల చేశారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య విద్వేషాలు రగిల్చే విధంగా సోషల్ మీడియా వేదికగా పరస్పర విమర్శలు, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు, పరస్పర విమర్శలు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు పెట్టేవారిపై సైబ ర్ సెల్ సోషల్ మీడియా విభాగం నిఘా ఉంచామని, సదరు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవాస్తవ ప్రచారాన్ని ప్రజలు ఎవరూ నమ్మవద్దని డీఎస్పీ సూచించారు. ఫేక్ న్యూస్ వ్యాప్తి ఫార్వర్డ్ చేసే వారిపై నిఘా ఉంచామని, నిజానిజాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో పోస్టు చేసే వారిపై, షేర్ చేసే వారిపై, సంబంధిత గ్రూప్ అడ్మిన్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. ఏమైనా సమస్యలుంటే పోలీసు అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటారిన, వారి దృష్టికి తీసుకువచ్చి సమస్యలు, సమాచారంపై అనుమానాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతగా పోలీసుశాఖకు సహకరించి సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పాటునందించాలని కోరారు.

జమ్మలమడుగులో ట్రాఫిక్ అస్తవ్యస్తం



ట్రాఫిక్‌లో నిలిచిపోయిన వాహనాలు

జమ్మలమడుగు, ఏప్రిల్ 7: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ప్రధానంగా గాంధీ విగ్రహం వద్ద తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. తాడిపత్రి రోడ్డు, ముద్దనూరు రోడ్డులో రోడ్డును ఆక్రమించి ఆటోలు, ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు, తోపుడుబండ్లు అడ్డంగా నిర్లక్ష్యం చేస్తూ నిలిపారు. అలాగే ప్రొద్దుటూరు రోడ్డు, మార్కెట్‌రోడ్డులో దారుణంగా మారింది. మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ కాలువలను ఆక్రమించి రోడ్డుపై వాహనాలు నిలుపుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలేదని విమర్శలు వినపడుతున్నాయి. ముద్దనూరు రోడ్డులో సిమెంటు, ఐరన్ షాపుల దుకాణాల యజమానులు రోడ్డుపైనే ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. ఆ రోడ్డున నడిచి వెళ్లే బాటసారులు, ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏ రకమైన ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు జంకుతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు ఉదయం, సాయంత్రం వేళల్లో పర్యవేక్షణ జరిపి ట్రాఫిక్ చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యకు సంబంధించి జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్ ట్రాఫిక్‌లో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

వైసీపీ పాలనలో అన్నివర్గాలు నష్టపోయాయి



పోరుమామిళ్లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బొజ్జ రోశన్న

కాశినాయన ఏప్రిల్ 7: గత 5సంవత్సరాలుగా వైసీపీ పాల నలో అన్నివర్గాల ప్రజలు నష్టపోయారని బద్వేల్ అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బొజ్జా రోశన్న పేర్కొన్నారు. ఆదివారం కోడిగుడపాడు,ఆనంవారిపల్లె గ్రామంలో టీడీపీ,జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఆయన ఇటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటేయ్యాలని కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజారెడ్డి, బంగారు గుర్విరెడ్డి, రవీంద్రారెడ్డి, ఎల్. శ్రీనివాసులరెడ్డి, నర్శిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్‌రెడ్డి, జనసేన నాయకుడు ఖలీల్, బీజేపీ నాయ కుడు పెద్దిరెడ్డి సతీష్‌రెడ్డి,డి.క్రిష్టారెడ్డి, పి.పోలిరెడ్డి,హోండా రవీంద్రా రెడ్డి, ఓ.రోహిత్‌రెడ్డి, బి.నరసింహారెడ్డి,మాజీసర్పంచ్‌పోరుమామిళ్ళ ఓబయ్య, అడవి రాముడు,అక్కి రమణారెడ్డి, శీలం పెద్దబాలిరెడ్డి, ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: బద్వేలు నియోజకవర్గం నుంచి కూటమిలోని బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొజ్జ రోశన్న ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదివారం పోరుమామిళ్లలోని చిదానందనగర్, బెస్తవీధి, రంపాడు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తనను బీజేపీ అభ్యర్థిగా గెలిపించాలని, అటు కేంద్రం నుంచి ఇటు రాష్ట్రం నుంచి నిధులు తీసుకుని వచ్చి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు.టీడీపీ,బీజేపీ,జనసేన నాయకులు పాల్గొన్నారు.

బద్వేలు..: అట్లూరు మండలంలోని అట్లూరు, కొండూరు గ్రామాల్లో బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్నకు ఓటేయండి అంటూ బీజేపీ కమలం గుర్తు చూపుతూ టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మండల ఇన్‌చార్జ్ రెడ్డయ్య ఆధ్వర్యంలో ఇంటింటి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. బీజేపీ ప్రవేశపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ టీడీపీ మేనిఫెస్టో పథకాల గురించి వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల యువ నాయకుడు జయక్రిష్ణారెడ్డి, బీజేపీ నాయకులు వేణు గోపాల్, అల్లం వెంకటసుబ్బయ్య, ఈటె మస్తాన్, జయరాంరెడ్డి, రామ చంద్రారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి , రిషికేశవ, నరసింహులు, అయ్యావారయ్య, అట్లూరు గోపాలయ్య, అట్లూరు కృష్ణయ్య, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బద్వేలు టౌన్..: బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశనన్నను ఆదరించాలని మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ కనుమర్లపూడి ప్రసాద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 9వ వార్డు ఆంజనేయనగర్‌లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రోశన్నను గెలిపించాలని ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మస్తాన్‌బాబు, శివయ్యస్వామి, రమణయ్య, రవి, జయరామయ్య, క్రిష్ణమూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నచౌకు పరిధిలో ఫ్లాగ్‌మార్చ్

కడప (క్రైం), ఏప్రిల్ 7 : నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి మీ వెంట మేమున్నాం అ ంటూ కడప నగరం చిన్నచౌకు పోలీసుస్టేష్ పరిధిలో సీఐ నరసింహారెడ్డి భరోసా కల్పిస్తూ కేంద్ర సాయుధ బలగాలతో ఆదివారం చిన్నచౌకు పురవీధుల్లో కవాతు చేస్తూ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో సీఐ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ రవికుమార్ పోలీసు సిబ్బంది, కేంద్ర సశస్త్ర సీమాబల్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని పాత బైపాస్, అశోక్‌నగర్, నెహ్రూనగర్, అప్సర సర్కిల్, ఎన్జీవోకాలనీ, వైజంక్షన్ ప్రాంతాల మీదుగా ఫ్లాగ్‌మార్చ్ చేస్తూ ప్రజలకు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని భరోసా కల్పించారు.

వైభవంగా పెద్దమ్మ జాతర



పెద్దమ్మ అమ్మవారి జాతరలో పాల్గొన్న భూపేశ్‌రెడ్డి

మైలవరం, ఏప్రిల్ 7: మండల పరిధిలోని నార్జాంపల్లిలో పెద్దమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించా రు. శనివారం అర్ధరాత్రి అమ్మవారిని గ్రామంలో కొలువు తీర్చారు. అనంతరం పెద్దమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి జంతు బలులు ఇచ్చారు. గ్రామంలో 21 ఏళ్ల తర్వాత పెద్దమ్మ జాతర చేస్తుండటంతో బంధువుల రాకతో సందడి నెలకొంది. కడప పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, జమ్మలమడుగు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవగుడి ఆదినారాయణరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా అగస్త్యేశ్వరస్వామి కల్యాణం



గంగా, రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 7: మాస శివరాత్రి సందర్భంగా అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం గణపత్రి, నవగ్రహ రుద్రహోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగా, రాజరాజేశ్వరిదేవి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కాలక్షేప మండపంలో ఆశీనులను చేశారు. వేద పండితులు సుముహూర్తంలో మంత్రోచ్చారణలతో స్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

● **నేడు భస్మ హారతి..:** అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అమవాస్య సందర్భంగా స్వామివారికి ప్రదోషకాలంలో ఉజ్జయిని మహాకాళేశ్వరునిలాగా పూజ, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహిస్తామని, సాయంత్రం 5 గంటలకు భస్మ హారతి ఉంటుందని ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు.

ప్రైవేటు ఉపాధ్యాయులను వేధించడం తగదు

బద్వేలు, ఏప్రిల్ 7: ప్రభుత్వ ఆదేశాలు పాటించకుండా రెండుపూట లా పాఠశాలలు నిర్వహిస్తున్న, అడ్మిషన్ల పేరుతో ప్రైవేటు పాధ్యాయు లను ఇబ్బందులకు గురి చేస్తున్న ఆయా పాఠశాలల యాజ మాన్యంపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల వారు ఉపాధ్యాయులను అడ్మిషన్ల పేరుతో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయిండంతో పాటు ఎవరినైనా చేర్పించకపోతే తమ పాఠశాలల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని ఇది వారికి తగదన్నారు.

అంగన్వాడీ భవనం పూర్తయ్యేదెన్నడు..?



ఆగిపోయిన భవన నిర్మాణం

జమ్మలమడుగు, ఏప్రిల్ 7: జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామంలో ఏడాది నుంచి అధికారుల నిర్లక్ష్యం వలన అంగన్వాడీ భవనం నిర్మాణం పనులు ఆగిపోయినట్లు స్థానికుల తెలిపారు. ముద్దనూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మైలవరం మండలం ఉండేది. 2023 జూలై నెల నుంచి ముద్దనూరు ప్రాజెక్టులో ఉన్న మైలవరం మండలాన్ని జమ్మలమడుగు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోకి అధికారులు మార్చారు. ముద్దనూరు ప్రాజెక్టు పరిధిలో ఉండే సమయంలో నాడు-నేడులో భాగంలో రూ.16 లక్షలకు దొమ్మరనంద్యాల గ్రామంలో అంగన్వాడీ భవనాన్ని నిర్మించేందుకు అధికారులు శంకుస్థాపన చేశారు. అప్పట్లో స్థానిక వ్యక్తి మద్దూరు సుబ్బరాయుడు స్థలాన్ని దానం చేసినట్లుగా స్థానికులు తెలిపారు. అప్పట్లో అధికారులు నిర్మాణం చేపట్టే కాంట్రాక్టర్ పునాదులు తీసి పనులు ప్రారంభించి ప్రస్తుతం శ్లాబ్ వరకు వచ్చింది. అయితే అంగన్వాడీ భవన నిర్మాణ పనులు విషయంలో పక్కనే ఉన్న స్థలానికి సంబంధించిన వ్యక్తి సుబ్బయ్య స్థలానికి సంబంధించి వాగ్వాదం జరిగినట్లు సమాచారం. అధికారులు చూసీ చూడనట్లు పట్టించుకోకపోవడంతో అక్కడ పనిచేసే కార్మికులు స్థలాన్ని ఎక్కువగా ఆక్రమించి నిర్మించారని ఆరోపణలున్నాయి. ఇందుకు సంబంధించి స్థల దాత పక్కనే ఉన్న స్థలం వ్యక్తి వాదోపవాదాలు చేసుకోవడం వలన పనులు ఆగిపోయాయని స్థలాన్ని కొలతలు వేసేందుకు స్థానిక సచివాలయ సిబ్బంది సైతం వచ్చినా పనులు ప్రారంభం కాలేదని స్థానికులు వాపోతున్నారు. ఏడాది నుంచి సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదని పలువురు వాపోతున్నారు. అంగన్వాడీ భవనానికి సంబంధించి నాడు-నేడులో రూ.16 లక్షలకు నిర్మాణం చేయాల్సి ఉందని అందులోనే రూ.2.50 లక్షలకు భవనానికి సంబంధించి వస్తువులు, ఫర్నీచర్ జిల్లా అధికారులే కొనుగోలు చేసి ఇచ్చారు. ఏది ఏమైనా అంగన్వాడీ భవనం రాజకీయంగా నిలిచిపోయినట్లుగా తెలుస్తోంది. ఈ సమస్యకు సంబంధించి గత నెలలో కడప నుంచి సర్వశిక్షా అభియాన్ ఏపీవో రజనీకాంత్ వచ్చి పరిశీలించినట్లుగా, అలాగే స్థానిక ఐసీడీఎస్ అధికారులు సైతం వచ్చి పరిశీలించినా పనులు ప్రారంభం కాలేదని స్థానికులు తెలిపారు. జమ్మలమడుగు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి రాజేశ్వరిదేవిని 'ఆంధ్రజ్యోతి' సమస్యను తెలుపగా మద్దూరు సుబ్బరాయుడు రెండున్నర సెంటు స్థలాన్ని అంగన్వాడీ భవనం నిర్మించేందుకు దానం చేసినట్లు ఆమె తెలిపారు. దాని పక్కనే ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వర్గీయులు సుబ్బయ్య అనే వ్యక్తి తన స్థలంలోకి వచ్చి కట్టారని దీంతో పనులు ఆగిపోయాయని ఇలానే కొనసాగితే త్వరలో స్థలానికి సంబంధించి కొలతలు వేయించి చర్యలు తీసుకుంటామని అన్నారు. లేకపోతే ఇలానే గొడవ పడితే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని ప్రస్తుతం రాజకీయ కారణాల వలన సమస్యగా ఉందన్నారు.